రాజా !

పిలుపు కొత్తగా వుందా? పెళ్ళామే రాసిందా ఈ ఉత్తరం, అజ్ఞాత ప్రేయసి ఎవరో ఎదుటపడటానికి జడియపడి ఇలాంటి ఉత్తరం రాసిందా అని వెనక్కి ముందుకి తిప్పి చూసుకుంటున్నారా? నేనే. మీ ఇల్లాల్ని.

పెళ్ళికి ముందు ప్రేయసిగా ఉండి పెళ్ళయ్యాక అందరు ఆడవాళ్ళలాగే పెళ్ళాంగా మారిపోయినదాన్ని. నిన్న మీరు బయలుదేరుతూ అన్నారు:

"రోజూ క్యాంపులు ఉండే ఉద్యోగస్తులే అదృష్టవంతులు. ఇల్లూ పెళ్ళాం పిల్లలూ— ఈ చికాకు నుంచి దూరంగా కొంతసేపైనా హాయిగా ఫ్రీగా ఉంటారు! ఇలాంటి క్యాంపులు ఆరు నెలలకొకటైనా తగలవు నాకు" అని. గుర్తుందా? నాకు మాత్రం ప్రతి అక్షరం గుర్తుంది. ఎందుకు ఉండదు? ఒక్కొక్క మాటా కత్తిలా నా గుండెని చీలుస్తూ ఉంటే. నేను వాటిని వినిపించుకోనట్టూ, నన్ను కానట్టూ ఎలా ఉండగలను? మీరు ఇల్లు కదిలిన దగ్గర్నుంచి ఈమాటలే నన్ను చిత్రవధ చేస్తున్నాయి. కాల్చుకు తింటున్నాయి. మీరులేక ఒంటరిగా ఉన్న నాకు క్షణంక్షణం నరకాన్ని రుచి చూపిస్తున్నాయి.

క్షమించండి. ఇవన్నీ రాయడానికి కాదు నేనీ ఉత్తరం ప్రారంభించినది. కాని నా దౌర్బల్యం నా ఉద్దేశాల కంటె ముందే కలంలో ప్రవేశించి ఇలా రాయిస్తూంది. నా కష్టాలు. నా ఫిర్యాదులతో మిమ్మల్ని చికాకు పరచడం. ఎక్కడో నాకు దూరంగా హాయిగా ఫ్రీగా వున్న మిమ్మల్ని వేధించడం నా అభిమతంకాదు. అందుకని పేరా మారుస్తాను."

రాజా!

నిజానికి ఈ పిలుపు కొత్తదికాదు. ఒక్కసారి మూసుకుపోయిన మీ మనసు తలుపు తెరిచి చూడండి. జ్ఞాపకాల మెట్ల వెంట పన్నెండేళ్ళు వెనక్కి వెళ్ళండి. సరికొత్త సరిగమలు మన సంసారాన్ని సురభిళం చేస్తున్న రోజుల్లోకి. అప్పుడు మీ రాణీ మిమ్మల్ని ఇలాగే పిలిచేది. గుర్తొచ్చిందా? నా పెట్టె అడుగున దాచుకున్న మీ ఉత్తరాల్లా. నా పెళ్ళి పట్టుచీర మడతల్లో భద్రంగా వుంచుకున్న పొగడ పువ్వుల్లా. ఆ జ్ఞాపకాలు ఈ రోజు నా గుండె అట్టడుగు పొరల్లోంచి పైకొచ్చి నన్ను ఉక్కిరి బిక్కిరి చేస్తున్నాయి. అప్పటి మీ ప్రేమలేఖల అగరు పొగలు నా మనసుని చుట్టుముట్టి ఊపిరాడకుండా చేస్తున్నాయి. ఏమండీ! నా మనసు ఏడుస్తూంది. ఆ రోజుల కోసం. ఆ రోజుల్లో జీవించిన మన ప్రేమ కోసం. "భావస్థిరాణి జననాంతర సౌహృదాని" అన్న కాళిదాసు వాక్యాన్ని మీరే నాకు వివరించి చెప్పేరు. మరి మన మధ్య పన్నెండేళ్ళకే ప్రేమ గంధం ఇంతగా ఇగిరిపోయిందేం? దానికి పూర్తిగా నాదేనా బాధ్యత? మీరు అప్పటి నా రాజాయేనా? ఒక్కసారి కోపం తెచ్చుకోకుండా ఆలోచించి చూడండి.... అదిగో. మళ్ళీ నా ఫిర్యాదులు. నా సోది మొదలు. ఏం చెయ్యను? అంతగా నాకవి అలవాటు అయిపోయాయి. ఈమధ్య మళ్ళీ పేరా మారుస్తాను.

నిన్న రాతిరి నాకు నిదుర రాలేదు. కన్నులూరకే తెరచి కూర్చున్నాను. పెట్టె అడుగు నుంచి మీ ఉత్తరాలు తీసి తాపీగా. పట్టుతేనె ఒక్కొక్క చుక్క చప్పరిస్తున్నట్టు ఆప్యాయంగా ఒక్కొక్క వాక్యమే చదువుకున్నాను ఏమండీ. నాకే రాశారా ఆ ఉత్తరాలు? నేనేనా అవి అందుకున్న అదృష్టవంతురాల్ని? మరి ఈనాడు ఆ నేనే అలాంటి పులకింతలకి కాదుకదా మామూలు పలకరింపులకి కూడా నోచుకోవడం లేదేం? నేనంటే మీకు బోర్ కొడుతూందా! అంతగా పాతబడిపోయానా నేను? అది కొంతవరకు నిజమే కావచ్చు. కాని నేనెప్పుడూ మీదాన్నే కదా! మీకు ఎప్పుడు ఎలా కావాలంటే అలా ఎందుకు నన్ను మలచుకోరు? నేనెప్పుడూ కాదననే. ఎలాగయినా మిమ్మల్ని సంతోషపెట్టడమే నా జీవిత ధ్యేయమని మీకు తెలుసుకదా! నాకు అత్యంతఆనందాన్నిచ్చేది మీఆనందమేనని మీకు తెలుసు కదా! మరిమిమ్మల్ని సుఖపెట్టే అవకాశం నాకెందుకు ఇవ్వరు? మీమనసేమిటో మీ కొత్త కోర్కెలు ఏమిటో అని తీర్చడానికి నేనేం చెయ్యాలో నాకెందుకు చెప్పరు?

ఏమైనా అంటే. "నేను నీ చేత సేవలు చేయించుకోవడం నాకు ఇష్టం వుండదు. నువ్వేమైనా నాకు దాసివా?" అంటారు. మీ హృదయవైశాల్యం మీ ఆధునికభావాలు వినడానికి బాగానే ఉంటాయి. కాని నాకుకావలసినది ఆ మాటలు కాదు. అంతకన్న మీకు దాసిగా ఉండడమే నాకు ఇష్టం. మీరుగాని ఇంకెవరైనా గాని నన్ను పాతకాలపు మనిషి అన్నా. బానిస భావాలు నాలో జీర్ణించుకు పోయాయనుకున్నా నాకేం అభ్యంతరం లేదు నాకు తెలుసు. నన్ను నేను మీకు పూర్తిగా అర్పించుకోవడం ద్వారానే మిమ్మల్ని నేను పూర్తిగా పొందగలను. నాకు వేరే వ్యక్తిత్వమూ అహంకారమూ అక్కర్లేదు. మీలో భాగమై.మీలో లీనం కావడమే కావాలి. నేను పూర్తిగా మీదాన్ని కావాలి ఆ ఆనందాన్ని నాకు ఏ ఆధునిక భావాలు. ఏ స్త్రీ స్వాతంత్ర్య వినాదాలూ ఇవ్వలేవు.

**మిమ్మల్ని దూరం చేసుకునే స్వాతంత్ర్యం కన్న మిమ్మలి స్వంతం చేసుకునే సంధి సూత్రమే కావాలి నాకు.**

## శేషేంద్రజాలం

దేశంలో నాలుగు చెట్లు పది పక్షులు
కూడా లేవు
వసంతం వస్తే స్వాగతం చెప్పడానికి
మళ్ళీ వచ్చిన కోకిలకు మామిడికొమ్మ
కనిపించనేలేదు
కూర్చుని గొంతు విప్పడానికి
కొత్త తరం కొడుకులకు కోకిలేమిటో
తెలీదు
జీవితంలో ఉగాది గుర్తించడానికి
గ్రామాలు గ్రామాలే ఏడుస్తున్నాయి
మనకు వినిపించడంలేదు
క్షామం ఏమిటో తెలుసుకోడానికి.


—శేషేంద్ర

# తెర

కె. గోదావరి శర్మ

చూడండి. ఎన్ని విషయాలు రాస్తున్నానో! ఇవేమీ మీకు తెలియనట్టు నిజానికి ఇవన్నీ నాకు మీరు నేర్పినవే 'నీవు నేర్పిన గానమే ఇది నీవు పెంచిన హృదయమే.' కాని రాజా ఈ రోజు మీ పాఠాలు మీకు గుర్తు చేయవలసిన అవసరం వచ్చింది. అందుకు నాకెంతో విచారంగా వుంది. ఇలాంటి రోజు ఎప్పటికీ రాకూడదని, రాదని అనుకున్నాను. వచ్చింది. కనీసం ఇకముందైనా ఇలాంటి ఉత్తరం మీకు రాసే అవసరం రాదని ఆశిస్తాను.

ఈ పన్నెండేళ్ళలో నేను మీకు ఎంత దూరం అయ్యాను! ఇద్దరం కలిసే వుంటున్నాం. లోకుల దృష్టిలో చక్కగానే సంసారం చేసుకుంటున్నాం. ఇద్దరు పిల్లల్నీ ఇతరులు అసూయ పడేటట్టు పెంచుతున్నాం. కాని వీటి వెనక మన హృదయాల్లో, మన జీవితాల్లో పెరుగుతున్న ఏదో ఒక శూన్యం. ఒక నిస్తబ్ధత మీరు గుర్తించలేదా? ఎన్నడో కలిసిన మనసులు ఏనాడు క్రమంగా, నిశ్శబ్దంగా విడిపోవడం మొదలుపెట్టాయో బహుశా మనమిద్దరం గుర్తించలేదు. ఏ వేరు పురుగులు మనకి తెలియకుండా మన సంసార వృక్షాన్ని సమూలంగా నాశనం చెయ్యడానికి సిద్ధమయ్యాయో మనం గుర్తించలేదు. మీకూ నాకూ మధ్య పలచని తెర పడింది.




ఎంతటి పలచటిదంటే ఉండీలేనట్టు ఉండేదేమో మొదట, అది క్రమంగా చిక్కబడుతున్నకొద్దీ, మీరు గుర్తించారో లేదో, గుర్తించీ ఎందుకు ఉపేక్షించారో గానీ నాలో భయం కూడా పెరగసాగింది. ఈ తెర క్రమంగా ఇనప తెరగా బలపడక ముందే మనం మేలుకొని దాన్ని ఛేదించాలి. నిన్నటి నుంచీ. మీరు నన్ను ఒంటరిగా వదలివెళ్ళిన దగ్గర్నుంచీ నేను ఈ విషయమే ఆలోచిస్తున్నాను.

ఎందుకంటే మన మధ్య ఈ దూరం, ఈ నిశ్శబ్దం సహజం కాదు. వాంఛనీయమూ కాదు. మనిద్దరం దాన్ని అభిలషించడం లేదని, ఆనందించడం లేదనీ మనిద్దరికీ తెలుసు. మనిద్దరికీ ఒకరి మీద ఒకరికి గాఢమైన ప్రేమ వున్న సంగతి రూఢిగా తెలుసు. పై పై అసంతృప్తులు, ఈ పాతబడిపోవడాలు కేవలం క్షణికమని. మన మనసుల్లోని ప్రేమని ఏమీ చెయ్యలేవనీ నా నమ్మకం. మీ ఉద్దేశ్యం కూడా అదే కదూ! అప్పుడు పన్నెండేళ్ళ క్రిందట ఎంత గట్టి పునాది వేసి కట్టాం మన ప్రేమ సౌధాన్ని! అది ఈవేళ ఇంత పిల్లీ కారణాలకి కూలిపోతుందా? కూలిపోదు కదూ? మీరు చెప్పండి. మీరూ ఔనంటే నాకు ధైర్యంగా ఉంటుంది.




# పంచాంగ పఠనం

ఈ ఉత్తరం చదవడానికి మీకు చాలా సమయం పట్టవచ్చు. కాని దయచేసి చదవండి. ఇది మీకు కేవలం పోస్టు చేయడానికిమాత్రమే రాయడంలేదు. నేను నాకోసం నేను రాసుకుంటున్నాను. అస్తవ్యస్తమైన నా భావాల్ని ఒక పద్ధతిలో పేర్చి చూసుకుంటున్నాను. అయినా మీకు రాస్తే నాకు నేను రాసుకుంటున్నట్టు కాదూ, మీరూ నేనూ ఒకటే అయినప్పుడు!

అదీ కాక ఈ ఉత్తరానికి ప్రేరణామీరే. మీరు రాయిస్తున్నదే ఈ ఉతరం. ఇందులో విషయాలు మనవి. అందుచేత సావధానంగా చదవమని మనవి. "మన పెళ్ళయ్యాక ఏ కారణంచేతనైనా ఏవో అపోహలూ, అపార్థాలూ కలగవచ్చు వాటిని మనం వీలైనంత వరకు మొగ్గలోనే తుంచేయాలి. వాటిని ఎవరు ముందు గుర్తిస్తే వాళ్ళు రెండో వాళ్ళకి తెలియజెయ్యాలి. అప్పుడే ఆ సమస్యని విశ్లేషించడానికి, పరిష్కరించడానికి అవకాశం ఉంటుంది. అంతేకాని లేనిపోని అనుమానాలతో, పంతాలూ, పట్టుదలలతో వుండిపోతే ఇద్దరికీనష్టం. మొత్తం మనుగడకే నష్టం." (ఈ మాటలు మీవే. పెళ్ళికిముందు మీరు నాకురాసిన ప్రేమలేఖ నం.6 లోంచి కోట్ చేశాను) ఈ మాటలు నేను మొదటసారి చదివినప్పుడు మీ అతి జాగ్రత్తకీ ముందు చూపుకీ నవ్వుకున్నాను. ఇంత తెలిసివుండీ ఈ గుణమెందుకు వస్తుందనుకున్నాను. కాని నిన్న రాత్రి మళ్ళీ ఆ వాక్యాలే చదువుతుంటే మీరూహించిన ఆ పరిస్థితి వచ్చినందుకు ఎంత దుఃఖమనిపించిందో! అప్పుడు భవిష్యత్తుని ఊహించిన మీరు ఇప్పుడు వర్తమానాన్ని ఎందుకు గుర్తించడంలేదో! లేక గుర్తించీ ఏమీ చేయలేమనుకుని నిస్పృహతో వదిలేశారా? సమస్యలు చర్చలవల్ల, సానుభూతి సహకారాలవల్లా పరిష్కారం కావాలిగ్గాని ముభావంగా వుండడంవల్ల, తప్పించుకు తిరగడంవల్లా కావు గదా!

ఏది ఏమైనా, నిన్న నేను చదివిన మీ ఉత్తరంలోని వాక్యాలు నాకు కర్తవ్యాన్ని బోధించాయి. నా సంసారంలో ఇబ్బందులు వచ్చినప్పుడు వాటిని ఎదుర్కొని సాధించవలసిన అవసరం, బాధ్యత నావే. దానికి మీ సహృదయత, సహకారం ఎప్పుడూ వుంటాయనే నమ్మకం నాకుంది. అందుకే ఇంత వివరంగా ఇంత ఉత్తరం. ఈ ఉత్తరాన్ని నేను నిన్న రాత్రినుంచీ ప్లాన్ చేస్తున్నాను కాని భావాలు సముద్ర కెరటాల్లా కల్లోలంగా, అనిశ్చలంగా ఉంటున్నాయి. నా సమస్యనీ, నా మనస్థితినీ పరిస్థితినీ మీ ముందు ఎలా వుంచాలో, మీ సానుభూతి ఎలా పొందాలో, దీనికి నేను ఏ పరిష్కారాన్ని ఎలా సూచించాలో తెలియక ఉదయం అంతా రెస్ట్‌లెస్‌గా ఉన్నాను.


మధ్యాహ్నం రేడియో పెట్టి అన్యమనస్కంగా వింటూ వుంటే ఒక పాట వచ్చింది "మాయాబజార్" లోది.

"నీ కోసమె నే జీవించునది.."

మనకి ఇష్టమైన పాట. మనిద్దరం కలిసి ఆ పాట ఎన్నిసార్లు వినలేదు? కాని ఈ రోజు నేనొక్కర్తినీ వింటూంటే దాని అర్థం, అంతరార్థం నాకు పూర్తిగా అవగతమైనట్టు అనిపించింది. అసలు ఆ పాట నా మనస్థితినే నా కోసమే ఆవిష్కరిస్తున్నట్టు అనిపించింది. ముఖ్యంగా,

"వియోగవేళల విరిసే ప్రేమల విలువలు కనలేవా?"

అన్న వాక్యం నాకు కొత్త పాఠాలు నేర్పింది. ఆ తర్వాత దాని గురించి ఎంతో ఆలోచించాను. నిజమే ఈ అస్పష్టమైన అసంతృప్తిని ఇన్నాళ్ళయి భరిస్తున్నాను. ఎప్పుడైనా ఇదేమిటి. దీని స్వరూపస్వభావాలేమిటి అని తర్కించడం. మీతో




చెప్పడం చేశానా? ఈ వేళ ఎందుకిలా ఏదో ఆవేశించినట్టు ఒక్క ఊపులో ఇదంతా మీకు రాసేస్తున్నాను? ఈ అవకాశం ఈ వియోగం వల్లనే కలిగింది. రోజూ మీతో కలిసి ఉండడంలో మంచో చెడో దాన్ని ప్రశ్నించకుండా అంగీకరించడం అలవాటై పోయింది. ఇష్టా యిష్టాలు మనసులోనే అదిమిపెట్టి రోజువారీ కార్యక్రమాలకి ఆటంకంలేకుండా ప్రవర్తిస్తున్నాం. ఈరొటీన్‌లో సునిశ్చితమైన ప్రేమావేశాలు హృదయ స్పందనలూ మరిచిపోతున్నాం. యాంత్రికంగా జీవిస్తున్నాం. మీరు భావుకులు. సునిశ్చిత మనస్కులు. పెళ్ళయ్యాక నన్ను మీరే ఇలా సుకుమారంగా ఉండేటట్టు ఓర్పుగా, జాగ్రత్తగా మలుచుకున్నారు. నాకు ఏమాత్రం రసహృదయం ఉన్నా అది మీ వల్ల, మీ సాన్నిహిత్యంలో సంక్రమించినదే. అసలు ఈ ఉత్తరం చూడండి. ఇదంతా ఇంత స్పష్టంగా వివరంగా ఇన్ని పేజీలు నేనే రాస్తున్నానా అని ఆశ్చర్యంగా వుంది నాకు. పెళ్ళికి ముందు మీకు నేను రాసిన ఉత్తరాలు తలుచుకుంటే సిగ్గు వేస్తుంది ఎంత మామూలుగా. జాలీగా రాసేదాన్ని! వాటికే మురిసిపోయేవారు లెండి శ్రీవారు? ఆ స్థాయి నుంచి ఇప్పుడీ ఉత్తరం ఇలా రాయగల స్థాయికి ఎదిగా నంటే ఇదంతా మీ చలవే. మరి నన్ను ఇంత తీర్చిదిద్దిన మీరే ఎందుకు బ్లంట్‌గా అయిపోతున్నారు? జీవితంలో అందాల్నీ ఆనందాల్నీ నాకు రుచిచూపించి మీరే వాటిని ఎందుకు వెలివేస్తున్నారు? మనమూ అందరు భార్యాభర్తల్లా కొట్టుకుంటూ తిట్టుకుంటూ డబ్బూ, నగలూ ఆచారాలూ మర్యాదలకోసం పాకులాడుతూ బతకడం నాకు ఇష్టంలేదు మనకి నచ్చినట్టు మనం ఉందాం మన దినచర్యలో ఈ అలసతనీ మామూలు తనాన్నీ వదిలేద్దాం చెప్పండి ఇద్దరం కూచుని ఏం చేస్తే, ఎలా చేస్తే జీవితం నిత్య నూతనంగా ఆనందమయంగా ఉంటుందో మాట్లాడుకుందాం. ఒకరినొకరు సంతోషపెట్టడానికి ప్రయత్నిద్దాం ఏం అలాగేనా? చదువుకున్న వాళ్ళం. అన్నీ తెలిసినవాళ్ళం మనమే ఇలా చిన్న చిన్న కమ్యూనికేషన్ గేప్స్ కారణంగా జీవితాన్ని నిస్సారం చేసుకోవడం ఎందుకూ?

ఇప్పుడు నా మనసు తేలికగా వుంది. ఇదంతా మీరు చదువుతారు. దాదాపు ఈ విషయాలన్నిటితో మీరూ ఏకీభవిస్తారని నా నమ్మకం. ఇంతకు మించి ఇంకేదైనా నాలో లోపం. నేను గుర్తించనిదీ, మిమ్మల్ని నానుంచి దూరంగా వుంచుతున్నదీ వుంటే నిస్సంకోచంగా నాతో చెప్పండి. నేనేమీ అనుకోను. నన్ను బాగుచేసుకోండి. నన్ను ఉపయోగించుకోండి. అది నాకూ మీకూ కూడా శ్రేయస్కరం.

ఈ రోజు మీరు దూరంగా వున్నందుకు విచారం లేదిప్పుడు నాకు. ఈ ఉత్తరం మొదలుపెట్టి నప్పటికీ ఇప్పటికీ నా మూడ్ మారిపోయింది. ఎందుకంటే నా మనసులో బరువు దింపేసుకున్నాను. నా ఆవేదన మీకు నివేదించుకున్నాను. మీరు మీ గదిలో, నేను వంటింట్లో ఎవరి పనులు వాళ్ళు చేసుకుంటూ రోజులు గడుపుతున్నంతకాలం ఇద్దరం ఒక ఇంట్లో వున్నా ఏమీ ప్రయోజనంలేదు. ఈ ఉత్తరంకూడా సాధ్యపడేది కాదు. ఎప్పుడైనా మూణ్ణెల్లకి ఆర్నెల్లకీ మీరు నన్నొదిలేసి ఎక్కడికైనా వెళ్ళండి. ఎప్పుడూ నాతోనే వుంటే మీకు బోర్ కొడుతుంది. కొత్త వాతావరణం, కొత్త మనుషులు కావాలి మీకు. నాకు మాత్రం మీరు చాలు. కాని నాకూ కాస్త ఏకాంతం. ఆలోచించుకోవడానికి గతాన్ని సమీక్షించడానికి సమయం కావాలి. బాటరీ అయిపోతే మళ్ళీ ఛార్జి చేసినట్టు మన ప్రేమ పాతబడిపోయినప్పుడల్లా కాస్త వియోగం, విరహం మంచిదే. అప్పుడు ఎదురుగా మనిషి లేకపోతే ఆ మనిషి గురించి ఆలోచిస్తాం. మనిషి అవసరం, విలువ తెలుస్తాయి. ఆ పాటలో పింగళి చెప్పినట్టు వియోగ వేళలలోనే వలపు పెరుగుతుందేమో! మీరు చెప్పారు ఒకసారి, మన ప్రాచీన కవులు సంభోగ శృంగారం కంటే ఎక్కువగా విప్రలంభ శృంగారాన్ని ఎందుకు వర్ణించేవారో! అప్పుడు నాకు సరిగా అర్థం కాలేదు. ఇప్పుడు అర్థం అయింది. ఈ ఎడబాటు మనమధ్య ఒక తెరలా పడిందనుకున్నాను. కాని మన మనసుల మధ్య నిలిచిన తెరని గుర్తించి తీసెయ్యడానికి ఉపయోగిస్తుందని ఇప్పుడు తెలుసుకుంటున్నాను. అంతేనా? ఇప్పుడు మీరు ఎప్పుడెప్పుడు వస్తారా అని ఎంత ఎదురుచూస్తున్నానో తెలుసా? 'ఎంత ఎడమైతే అంత తీపి కలయిక' అని గుర్తు చేసుకుంటున్నాను. మీ రాక కోసం పునస్సంధానం కోసం నా మనసునీ, శరీరాన్నీ, మన ఇంటినీ సజాయిస్తున్నాను. వాసకసజ్జికనై, అభిసారికనై మీ కోసం ఎదురు తెన్నులు చూస్తున్నాను.

రాజా, త్వరగా రండి!

ఎప్పటికీ
మీ
రాణి.

## కోయిలగా కూయిస్తూ

ఈ చెట్లు
వాడిన ఆకుల్ని రాల్చి వేస్తూ....
క్రొత్త చివుళ్ళతో ముస్తాబవుతూ....
నవకాల్కి పుక్కిలిస్తూన్నట్లు—
నీవు కూడా....
వాడిన ఆకుల్లాంటి
నీ నిరాశల్ని రాల్చి వేసి,
ఆశలనే క్రొత్త చివుళ్ళను
చివురింప జేసుకో!
చేదు అనుభవాల్ని తింటూన్న
నీ మనసుని - కోయిలగా
తీయగా కూయిస్తూ....
రేపుని చిరునవ్వుతో ఆహ్వానిస్తూ
నీ జీవితం నిత్య వసంతంగా
ఉండేలా చూసుకో!!!

—రఘువర్మ